క్లుప్తంగా

పాత సామగ్రి వేలం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: మున్సిపల్ కార్యాలయంలో పాతసామగ్రి (ఇనుము, అల్యూమినియం, ప్లాస్టిక్, అట్టలు, పేపర్లు)కి సంబంధించి, వేలంపాట మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో పెద్దఎత్తున పాటదారులు పాల్గొని, వేలంపాట పాడారు. పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్ ఎక్కువ మొత్తం పాటపాడి, సామగ్రి దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కె.శ్రీనివాస్, ఆర్ఐ రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18 మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఏఎస్ఐ భాస్కరరావు

బొబ్బిలి: పట్టణంలోని శిరుగుడు వీధి వద్ద ఉంటున్న శంకరరావు అనే వ్యక్తి దగ్గర నుంచి 18 మద్యంసీసాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యంసీసాలు కలిగి ఉన్నాడన్న ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమై అతడిని పట్టుకుని, కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ షేక్‌శంకర్

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ షేక్‌శంకర్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాద రుసుం విధించారు. వాహనదారులంతా తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా వాహన ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలని తెలిపారు.

విద్యార్థుల సత్తా



సర్టిఫికెట్లతో విద్యార్థులు

వంగర: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో స్థానిక ఆర్‌సీఎం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శ్రీకాకుళం జిల్లా జట్టు తరఫున తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారని, ఈ నెల 21, 22వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరచారని ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లోరిండా, పీఈటీ అరసాడ కృష్ణలు మంగళవారం తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారిలో ఎస్.గణేష్, వి.శశాంక్, బి.జశ్వంత్, పి.వంశీ, ఎస్.చందు, బి.హర్షవర్ధన్, బి.అఖిల్ ఉండగా, వారిని సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఘటోత్సవం



ఘటం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రాజాం సిటీ: రాజాం–సారధి గ్రామదేవత పండగలో భాగంగా ఘటోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రెండో ఘటమైన బురదలపోలమ్మ ఘటాన్ని రాజాంతో పాటు పరిసర గ్రామాల భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రాజాంలోని మొత్తం 16 వీధుల మీదుగా ఈ ఘటాన్ని ఊరేగించి, అనంతరం వనంగుడికి చేర్చనున్నారు. తిరువీధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ నాగావళి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ లారీని పోలీసులు మంగళవారం పట్టుకుని, సీజ్ చేశారు. కొమెర వెంకటాపురం నుంచి కూడా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, ఆ ప్రాంతంలో కూడా నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్ఐ పి.నీలావతి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- దుర్గంధభరితంగా కూరగాయల మార్కెట్
- ఆర్‌టీసీ బస్టాండ్ సెప్టిక్‌ట్యాంకు లీకేజీతో దుస్థితి
- వ్యాపారుల షెడ్డుల కిందకు వస్తున్న మురుగునీరు
- దుర్వాసనకు భయపడి రాని కొనుగోలుదారులు
- లబోదిబోమంటున్న చిరువ్యాపారులు
- పట్టించుకోని ఆర్‌టీసీ అధికార యంత్రాంగం



దుర్వాసన కారణంగా ముక్కు మూసుకున్న చిరువ్యాపారులు

దుర్గంధం.. భరించలేం..!

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ దుర్గంధ భరితంగా తయారైంది. మార్కెట్‌ను ఆనుకుని ఉన్న ఆర్‌టీసీ బస్టాండ్‌కు చెందిన సెప్టిక్‌ట్యాంక్ లీకేజీ కారణంగా మురుగునీరంతా వ్యాపారుల షెడ్డుల కిందకు చేరుకుంటోంది. దీంతో దుర్వాసన విపరీతంగా వస్తోంది. అక్కడి వెళ్లే వారంతా ముక్కులు మూసుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడి చిరువ్యాపారులైతే ఏకంగా మూతికి గుడ్డ కట్టుకుని వ్యాపారం చేయాల్సిన పరిస్థితి. షెడ్డుల కిందకు మురుగునీరు వస్తుండడంతో ఆ దుర్వాసనకు కొనుగోలుదారులు అంతగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇక్కడి అపారిశుధ్యం కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. తమ వ్యాపారం దేవుడెరుగు.. తమ ఆరోగ్యాన్ని అయినా దృష్టిలో ఉంచుకుని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం, మురుగునీరు



శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌టీసీ బస్టాండ్ సెప్టిక్‌ట్యాంక్

నరకం చూస్తున్నాం..



మా షెడ్డుల దగ్గరకే మురుగునీరు వస్తోంది. వెదజల్లుతున్న దుర్వాసనతో నిత్యం నరకం చూస్తున్నాం. ముక్కు, నోరు మూసుకుంటున్నాం. కంపు వాసనకు భయపడి కూరగాయలు కొనడానికి కూడా భయపడుతున్నారు. పంచాయతీ, ఆర్‌టీసీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తే మేలు.

–రాములమ్మ, చిరువ్యాపారి, రామభద్రపురం

బస్టాండ్ ఆవరణలోనూ..

ఇదిలా ఉంటే ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలోనే ఓ పెద్దగొయ్యి ఉంది. ఆ గొయ్యిలో రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోయి కంపు కొడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్టాండ్ ఆవరణలో ప్రస్తుతం నెలకొన్న అపరిశుభ్రతపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటు మార్కెట్ ఆవరణలో, ఇటు బస్టాండ్‌లో ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కలిసి, విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇక్కడి మురుగునీటి సమస్యను పరిష్కరించాలనికోరుతున్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 73 మంది ఎంపిక



కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు జాక్సన్

బాడంగి: మండలంలోని కోటిపల్లిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో దత్తిరాజేరు మండలం, పోరలికి చెందిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారు ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వివిధ కంటి సమస్యలతో శిబిరానికి హాజరైన 135 మంది కళ్లను వైద్యుడు జాక్సన్ తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 73 మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరమని, వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలోనే వారికి ఆపరేషన్లు చేసి, తిరిగి ఇంటికి ప్రత్యేక వాహనంలో తరలించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాడాడ పీహెచ్‌సీ సీహెచ్‌వో జోగినాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రమామణి, హౌసింగ్ డీఈ అప్పయ్య

రామభద్రపురం: ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీవో రమామణి, హౌసింగ్ డీఈ అప్పయ్య అన్నారు. మన ఇళ్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశమైన వారు.. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఆ దిశగా లబ్ధిదారులను చైతన్యం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల పూర్తికి వంద రోజుల ప్రణాళిక వేసుకుని, అమలు చేయాలన్నారు. మండలంలోని బేస్‌మెంట్ దశలో 250, రూఫ్ స్థాయిలో 84, శ్లాబ్ దశలో 54, లింటెల్ దశలో 44 ఇళ్లు ఉన్నాయని, 2025 మార్చి 31వ తేదీ లోపు శతశాతం నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు మాత్రమే బిల్లులు అవుతాయని, ఆ తర్వాత నిర్మించినా బిల్లులు అయ్యే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

రేగిడి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా విద్యాబోధన చేయాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని రేగిడి, పుర్లి, ఆమదాలవలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన అనంతరం పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో ప్రజలకు ఏం చేశారు?

- లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వంపై లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు మండిపడ్డారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. అధికారంలోకి వచ్చి వంద రోజులైందని, ప్రజలకు ఏం చేశారని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా రైతుకు ఇస్తానన్న రూ.20 వేల సాయం అందలేదని, పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా తల్లికి వందనం పథకం పేరిట ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తానన్న ఆర్థికసాయం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమూ లేదు.. ఉచిత గ్యాస్ సిలిండర్లు లేవు.. ఏం మేలు చేశారని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కుసుమూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో సామూహిక సీమంతం కార్యక్రమం, పౌష్టికాహార ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎం.శ్రీనును రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు రైతుకు ఇస్తానన్న రూ.20 వేల పెట్టుబడి సాయం అందేలా చూడాలని, రైతు రుణమాఫీ చేయాలని, జీవో నంబర్ 22ను రద్దు చేయాలని, కౌలురైతులకు గుర్తింపుకార్డులు, రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. జె.రంగరాయపురం గ్రామం వద్ద దాలిందర చెరువు నిండిపోవడంతో బయటకు వస్తున్న నీరు కారణంగా అక్కడి పంటపొలాలు నీటమునుగుతున్నాయని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు రెడ్డి త్రినాధ, ఉడముల ప్రసాద్ ఉన్నారు.

సక్రమంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన.. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ క్రమం తప్పకుండా చెత్తను సేకరించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. కేంద్రాల వద్ద తయారయ్యే ఎరువును రైతులకు తక్కువ ధరకు ఇచ్చి, పంచాయతీకి ఆదాయం సమకూరేలా చూడాలన్నారు.

విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు



బ్యాంకు ఖాతా దరఖాస్తులు చూపిస్తున్న విద్యార్థులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు మంగళవారం తెరిపించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, బొబ్బిలి శాఖ సిబ్బంది విద్యార్థులతో జీరో అకౌంట్ ఖాతాలను తెరిచారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శివన్నారాయణ కోరారు.

రైతు సమస్యల పరిష్కారానికి 'పొలం పిలుస్తోంది'



తెర్లాం: ఆమిటిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో సునీల్‌కుమార్

బొబ్బిలిరూరల్/బాడగి/తెర్లాం/రామభద్రపురం/సంతకవిటి/రేగిడి/వంగర/రాజాం సిటీ: మండలాల్లోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వ్యవసాయం, దాని అనుబంధ శాఖల సేవలను రైతు ముంగిటకు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారంలో రెండు రోజుల పాటు ఒక్కోరోజు నాలుగు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, ఏ నేలలో ఏ పంట వేస్తే అధిక దిగుబడులు వస్తాయి.. ఏ పంటకు ఏ ఎరువు ఎప్పుడు వేస్తే బాగుంటుంది.. ప్రభుత్వ సదుపాయాలను వివరించడం జరుగుతుందన్నారు.

విద్యుత్ సమస్యలపై నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను



విద్యుత్ శాఖ ఏఈ ఎల్లంనాయుడును ప్రశ్నిస్తున్న సర్పంచ్

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులు సకాలంలో పరిష్కరించడంలో విఫలమవుతున్నందున తమను ప్రజలు నిందిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాల కోసం కొన్ని రూ.లక్షలు వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడపడితే అక్కడ ప్రజాప్రతినిధుల అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారని, ఇళ్లస్థలాల్లో స్తంభాలు వేస్తున్నారని, వాటిని సరిచేయాలని అభ్యర్థిస్తే అదిగో.. ఇదిగో అని కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇళ్లస్థలాల్లో విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేస్తే ఇళ్లు ఎలా కట్టుకుంటారని జగన్నాథపురం, వెలగవలస, కృష్ణాపురం గ్రామాల సర్పంచ్‌లు మండిపడ్డారు. ఇళ్ల మీదుగా ప్రమాదకరగా ఉన్న విద్యుత్ వైర్లు ఉన్నా.. ఇళ్లస్థలాల్లోని విద్యుత్ స్తంభాలు తీయమన్నా ఆ శాఖ నుంచి సరైన స్పందన రాకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న సమావేశానికి విద్యుత్ శాఖ డీఈ హాజరై, సమాధానమివ్వాలని పట్టుబట్టారు. అలాగే ఆయనను రప్పిస్తామని ఎంపీడీవో రవికుమార్, ఏఈ ఎల్లంనాయుడులు సర్దిచెప్పారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష జరగ్గా, సభ్యులు అడిగిన ప్రశ్నలు అధికారులు సమాధానం చెప్పారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తహసీల్దారు శ్రీను తెలిపారు. ఆ తర్వాత అధికారులు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

సంతకవిటి: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్దన్ తెలిపారు. కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించడమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్/జాతీయ సేవా పథకం)ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'

రేగిడి: మండలంలోని వందానపేట గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో శ్యామలాకుమారి కార్యక్రమంలో పాల్గొని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా తాగునీటి వనరుల వద్ద పరిశుభ్రత పాటించాలని, బ్లీచింగ్ చల్లాలన్నారు. బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, సర్పంచ్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ధరల పెరుగుదల

- ఆర్యవైశ్య సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ ఎస్.అన్నాజీరావు

రామభద్రపురం: ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆర్యవైశ్య సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ నడిపిల్లి అన్నాజీరావు విమర్శించారు. మండల కేంద్రంలోని తన కిరాణా దుకాణానికి మంగళవారం వచ్చిన కొనుగోలుదారులు నిత్యవసరాల ధరలు ఎందుకు పెంచేస్తున్నారని ప్రశ్నించగా, ప్రభుత్వం తీరుపై ఆయన మండిపడ్డారు. 15 కిలోల ఆయిల్ డబ్బాకు రూ.350 నుంచి రూ.400లు, ఉల్లిపాయలు కిలో రూ.60 ఇలా అన్నీ ఒక్కసారిగా అమాంతం ధరలు పెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొద్దోగొప్పో పెరిగాయో లేదో అప్పట్లో బాదుడే బాదుడు అంటూ విమర్శించారని, ఇప్పుడు వారే అధికారంలో ఉన్నా.. ధరలు పెరిగిన మాట ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ధరలు తగ్గించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనందున వారిని సిబ్బంది మంగళవారం అభినందించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం సీహెచ్ గురుమూర్తి తెలిపారు. బాలికల జూనియర్ విభాగానికి సంబంధించి ఎం.మమత, ఆర్.రీతిక, బాలురు విభాగానికి సంబంధించి జె.జశ్వంత్, బి.కులశేఖర్‌లు ఎంపిక కాగా సీనియర్ బాలికల విభాగంలో ఎం.షర్మిల, జె.సాయితేజ, బాలురు విభాగంలో కె.చరణ్‌తేజ్, ఆర్.సతీష్ ఉన్నారన్నారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.భాస్కరరావు, వి.రామారావు, గీతారాణి, విజయలక్ష్మి, చిట్టిబాబు, రాంబాబు, పీడీ ఎం.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో పరిశీలన

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో 15వ ఆర్థికసంఘ నిధులతో నిర్మించిన మురుగుకాలువలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం కాలువ నిర్మాణ నాణ్యతపై ఆరాతీశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి, సకాలంలో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డావు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు